క్లుప్తంగా

భగవద్గీత పఠన పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక

వేంపల్లె : భగవద్గీత పఠన పోటీలలో వేంపల్లె శ్రీచైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన పి.హిమ శ్రీస్నిగ్ధ భగవద్గీత పఠన పోటీలలో తన అసామాన్య ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ పోటీలలో జోనల్ స్థాయిలో కొన్ని వేలమంది విద్యార్థులు పాల్గొనగా.. తమ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచి గ్రేడ్–సి విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయికి అర్హత సాధించిందన్నారు.

శనగపంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

లింగాల : శనగ పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రమేష్ రైతులకు సూచించారు. మంగళవారం కర్ణపాపాయపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని శనగ పంటను పరిశీలించి మాట్లాడారు. రబీలో సాగు చేసిన శనగ పంటలో పురుగు ఉధృతి, వేరుకుళ్లు తెగులు ఉన్నట్లు గుర్తించానన్నారు. వేరుకుళ్లు తెగులు నివారణకు హెక్సాకొనాజోల్ 2ఎం.ఎల్ లీటరు నీటికి, టెబుకోనాజోల్ ఒక ఎం.ఎల్ లీటరు నీటికి, 13:0:45 అనే రకం మందును కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.

మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

జమ్మలమడుగు రూరల్ : మైలవరం మండలంలోని వేపరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు ఎక్సైజ్ శాఖా సీఐ సరితారెడ్డి అవగాహన కల్పించి మాట్లాడారు. మాదకద్రవ్యాలు శరీరంపై చూపించే ప్రభావాలు ఆమె వివరించారు. అనంతరం న్యాయవాదుల బార్ అసోసియేషన్ సెక్రటరి కె.వి.మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల అనర్థాలు వివరించారు. అనంతరం డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

పరామర్శ

పెండ్లిమర్రి : మండలంలోని మమ్ముసిద్దుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డిని మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. శివశంకర్‌రెడ్డి కడప నగరంలోని ఓ ప్రయివేట్ అసుపత్రిలో గుండెకు స్టంట్ వేయించుకుని విశ్రాంతి పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆయన అతనిని పరామర్శించి ఆరోగ్య విషయాలను డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ముద్దనూరు మేజర్ పంచాయతీకి అవార్డు

ముద్దనూరు : ముద్దనూరు మేజర్ గ్రామపంచాయతీకి పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్(మరుగుదొడ్ల నిర్మాణం)లను నిర్మించి ప్రజల్లో అవగాహన కల్పించిన పంచాయతీ సర్పంచ్ బోనం సరళను జిల్లా అధికారులు సత్కరించారు. మంగళవారం కడప నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఓబుళమ్మ, జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మీలు సర్పంచ్ సరళను సన్మానించారు. స్థానిక మేజర్ పంచాయతీలో మరుగుదొడ్ల నిర్వహణపై, కమ్యూనిటీ టాయిలెట్స్‌పై అవగాహన పెంపొందిచడంతో పంచాయతీకి ఈ అవార్డు దక్కిందని ఎంపీడీవో ముకుందరెడ్డి తెలిపారు. జిల్లా మూడు గ్రామ పంచాయతీలకు ఈ అవార్డులు దక్కాయని అందులో ముద్దనూరు ఒకటని ఆయన తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన

వేముల : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ సీడీపీఓ సునీత బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో విద్యార్థులు చొరవ చూపాలన్నారు. అంతేకాక వారిలో రక్తహీనత, పోషక విలువల గురించి వివరించారు. బాలికల హక్కులు, చట్టాలపై వివరిస్తూ వీటిని ప్రతి విద్యార్థిని తెలుసుకోవాలని సూచించారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ శారదమ్మ, పాఠశాల, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించండి

వేంపల్లి : రాష్ట్ర బడ్జెట్లో రూ.270 కోట్ల బ్రాహ్మణ సంక్షేమానికి కేటాయించడం హర్షణీయమని, అయితే ఆ నిధులు సక్రమంగా బ్రాహ్మణులకు వినియోగం కావాలంటే ఇప్పటికే మూతపడిన బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది నాయకులు బ్రాహ్మణ కులాన్ని బీసీ కులంలో కలిపి బ్రాహ్మణ వృత్తులను కులవృత్తులుగా చూపి రుణాలు మంజూరు చేయాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. బ్రాహ్మణ కులంలో ఎంతోమంది ఉన్నత చదువులు చదివిన యువతీ యువకులు నిరుద్యోగులుగా ఉన్నారని, మహిళలు చదువుకుని ఇంటి దగ్గరే ఉంటున్నారన్నారు. వారి సంక్షేమం కోసం సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలన్నారు.



ఈ రైతు పేరు అంకిరెడ్డి. వేముల మండలం గొందిపల్లె గ్రామం. తనకున్న 8 ఎకరాలలో శనగ పంట సాగు చేశాడు. సాగు సమయంలో లక్ష రూపాయలకుపైనే పెట్టుబడులు పెట్టాడు. అదునులో వర్షం పడటంతో శనగ సాగు చేశాడు. సాగు అనంతరం తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిశాయి. దీంతో శనగ పంటకు వేరుకుళ్లు తెగులు సోకింది. వర్షాలకు ముందు ఆశాజనకంగా శనగ పంట వర్షాలతో దెబ్బతింటోంది. ఇప్పటికే రూ.30 వేలు ఖర్చు చేసి రెండుసార్లు మందులు పిచికారి చేశారు. తెగులు అదుపులోకి రాకపోవడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. సాగులో పెట్టిన పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రోజు రోజుకు పంట తెగుళ్లతో ఎండిపోతోందని వాపోతున్నాడు.



ఈ రైతు పేరు వెంగల్‌రెడ్డి. వ్యవసాయమే జీవనాధారం. తనకున్న పొలంలో పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఖరీఫ్‌లో పంటలు లేకపోవడంతో రబీపై ఆశతో శనగ పంట సాగు చేశాడు. తనకున్న 7ఎకరాలలో అక్టోబరు చివరి వారంలో శనగ సాగు చేశాడు. వర్షాలతో పంటకు వేరుకుళ్లు తెగులు సోకింది. ఈ తెగులుతో పంట పసుపు పచ్చగా నిలువునా ఎండుతోంది. తెగులు నివారణ కోసం రెండుసార్లు రూ.35వేలు ఖర్చు చేసి మందులు పిచికారి చేశాడు. తెగులు అదుపులోకి రాక ఎండుతోంది. సాగు చేసిన పంట కళ్లముందే నిలువునా ఎండుతుండటంతో రైతు జీర్ణించుకోలేకపోతున్నాడు.

శనగ పంటను దెబ్బతీస్తున్న తెగుళ్లు

- నియోజకవర్గంలో 30వేల ఎకరాలలో శనగ సాగు
- మందులు స్ప్రే చేసినా అదుపులోకి రాని వైనం
- శనగ సాగులో వేల రూపాయల పెట్టుబడులు
- ఆందోళన చెందుతున్న రైతులు



వేరుకుళ్లు తెగులుతో దెబ్బతింటున్న శనగ పంట



రబీలో సాగు చేసిన శనగ పంట

వేముల : ఈ ఏడాది పలివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా 30 వేల ఎకరాలలో శనగ పంట విస్తారంగా సాగైంది. నియోజకవర్గంలో 30190 ఎకరాలలో శనగ సాగైనట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. సకాలంలో వర్షాలు కురిసి భూములు పదునై అయ్యాయి. అదునులో విత్తనం పడటంతో రైతు దిగుబడులపై ఆశలు పెట్టుకున్నారు. పంట సాగు చేసి 40 రోజులు దాటింది. తుఫాన్ కంటే ముందు ఆశాజనకంగా ఉన్న పంట తుఫాన్ అనంతరం రైతులను నిరాశపరుస్తోంది. పంటను చూసిన తరం రైతులు ముందు జాగ్రత్తలు కూడా తీసుకున్నారు. పూతదశకు వచ్చే సమయంలో పంట దెబ్బతింటుండటంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారు. ఖరీఫ్‌లో పంటలు దెబ్బతిని నష్టపోయినా రబీ ఆదుకుంటుందని ఆశించిన రైతుకు తెగుళ్ల నిరాశపరుస్తున్నాయి.

వేరుకుళ్ల తెగులుతో దెబ్బతింటున్న పంట

రబీలో సాగు చేసిన శనగ పంట వేరుకుళ్ల తెగులుతో దెబ్బతింటోంది. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసి తేమ అధికమైంది. భూమిలో తేమ ఆరిపోయే కొద్ది పంటకు వేరుకుళ్ల తెగులు సోకుతోంది. ఈ తెగుళ్ల వల్ల మొక్కలు పసుపు పచ్చగా మారిపోతున్నాయి. కింది నుంచి పైవరకు మొక్క ఎండుతోంది. ఇప్పటికే రైతులు రెండు పర్యాయాలు పురుగు మందును స్ప్రే చేశారు. అయితే పంటలో వేరుకుళ్ల తెగులు నివారణకు మందులను స్ప్రే చేస్తున్నారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.2వేల మేర మందుల కోసం వెచ్చించారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు పంటను దెబ్బతీస్తున్నాయి. ఇప్పటికే పంట దెబ్బతినడంతో మరో తుఫాన్‌తో వర్షాలు వస్తే పంటను వదులుకోవాల్సిందేనని రైతులు అంటున్నారు.

సాగులో వేల రూపాయల పెట్టుబడులు

శనగ సాగులో రైతులు భారీగా పెట్టుబడులు పెట్టారు. ఎకరాకు రూ.15 వేలకుపైనే పెట్టుబడులు పెట్టి పంటను సాగు చేసుకున్నారు. పంట విత్తనం మొదలు దిగుబడులు అందేవరకు ఎకరాకు రూ.25 వేలకుపైనే పెట్టుబడులు అవుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, బాడుగలు, కలుపుతీత, పురుగు మందులు కలుపుకుని పెట్టుబడులు ఎక్కువగానే అవుతున్నాయి. పంటలో దిగుబడులు వచ్చేసరికి నాలుగుసార్లు మందులను స్ప్రే చేయాల్సి వస్తోంది. ఈ లెక్కన ఎకరాకు మందులకే రూ.8 వేలను రైతులు ఖర్చు చేస్తున్నారు.

సాగులో తగ్గనున్న దిగుబడులు

శనగ సాగులో దిగుబడులు ఆశించిన మేర అందే పరిస్థితి కనిపించలేదు. తెగుళ్ల పంట దిగుబడులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని రైతులు ఆశించారు. అయితే తెగుళ్లతో ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్లు కూడా అందవని రైతులు అంటున్నారు. పంట సాగులో పెట్టుబడులు పెరిగిపోయి దిగుబడులు తగ్గితే తీవ్రంగా నష్టపోతామని రైతులు అంటున్నారు. శనగ పంటను చూసి దిగుబడులు బాగా ఉంటాయని ఆశించామని వేరుకుళ్ల తెగులు తీవ్ర ప్రభావం చూపుతోందని రైతులు అంటున్నారు.

నేడు ఉత్తర ద్వార దర్శనం

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన శ్రీ మోక్ష నారాయణస్వామి ఆలయంలో బుధవారం ఉత్తర ద్వార దర్శనం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ, పుణ్యభూమి ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. మార్గశిర ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం నిర్వహిస్తామన్నారు. ఈ ఏకాదశి రోజున ఉదయం గం. 7.04ని. గం.11.48 ని. వరకు రవి యోగం ఏర్పడుతున్నందున ఈ సమయంలో శ్రీ మహా విష్ణువును భక్తి శ్రద్ధలతో పూజించడం వలన సుఖ సంతోషాలు ఐశ్వర్యం పెరుగుతాయన్నారు. ఈ ఏకాదశి స్థితిలో రేవతి అశ్విని రెండు నక్షత్రాలు రెండు కూడా వస్తున్నందున దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి మహా విష్ణువు మహాలక్ష్మీలను భక్తి శ్రద్ధలతో పూజిస్తే శుభ ఫలితం చేకూరుతుందన్నారు. అలాగే చాలా అరుదుగా వచ్చే భద్రావస్ యోగం కూడా ఏకాదశి నాడు వస్తున్నందున ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే మహా ఆలయాలలో ఉత్తర ద్వార దర్శనం చేసినంత పుణ్యఫలం సిద్ధిస్తుందని వారన్నారు. భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాలు జయప్రదం చేయాలని తెలిపారు.

నేడు సరస్వతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

లింగాల : మండలంలోని పెద్దకుడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సరస్వతి అమ్మవారి విగ్రహ ప్రతిష్టను నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి తెలిపారు. వేద పండితుల మంత్రోచ్చరణలతో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేస్తామన్నారు.

కమలాపురంలో కోతులు, కుక్కల బెడద



గాయాన్ని చూపుతున్న రామసుబ్బమ్మ

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ వీధి, క్రాస్ రోడ్డు, రైల్వే గేటు, అప్పాయపల్లె తదితర ప్రాంతాల్లో కోతులు ఎక్కువగా ఉన్నాయి. తలుపులు తెరిచి ఉన్న ఇళ్లలోకి జొరబడి మరీ సరుకులు, కూరగాయలు తీసుకెళ్తున్నాయని స్థానికులు కోరుతున్నారు. మంగళవారం కె.కొత్తపల్లెకు చెందిన వృద్ధురాలు రామసుబ్బమ్మపై కోతులు దాడి చేసి ఆమె తోపుడుబండిపై విక్రయించుకుంటున్న పండ్లు తీసుకెళ్లాయి. అలాగే సంబటూరు బస్టాండు, చౌక్ సెంటర్, మార్కెట్ వీధి, క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కుక్కలు ప్రజలపై దాడులు చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పాయపల్లె ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్న వాహన చోదకులను వెంబడించి మరీ దాడులు చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కోతులు, కుక్కలను పట్టించి ఇతర ప్రాంతాలకు తరలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రతి విద్యార్థి మానవ హక్కులను తెలుసుకోవాలి



మాట్లాడుతున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

వేంపల్లె : ప్రతి విద్యార్థి మానవ హక్కుల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యమని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. మంగళవారం స్థానిక ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం వేడుకలలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవ హక్కుల గురించి, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. మీకు ఏ విధమైనటువంటి సమస్యలు వచ్చినా మా దృష్టికి సత్వరమే తీసుకరావాలన్నారు. అనంతరం అదేవిధంగా విద్యార్థులు మానవ హక్కులు, విధులపై ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి సంక్షేమ అధికారి వెంకటేష్, ట్రిపుల్‌ఐటీ ఎఫ్‌ఓ కోటేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి



పంటలను పరిశీలిస్తున్న ఆత్మా పీడీ, కేవీకే శాస్త్రవేత్త

వల్లూరు : రైతులు శనగ, మినుము పంటల రక్షణకు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వీ శిల్పకళ, ఆత్మా పీడీ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని తోల్లగంగనపల్లె, గోటూరు గ్రామాలను మంగళవారం వారు సందర్శించి శనగ, మినుము పంటలను పరిశీలించి తెగుళ్ల ఉధృతిని గమనించారు. అనంతరం శిల్పకళ శనగ పంటలో ఆకు మాడు తెగులు సోకడం వలన పూర్తిగా ఎండిన మొక్కలు, పాక్షికంగా ఎండిన కొమ్మలు కనిపిస్తాయని, కొమ్మలపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయన్నారు. అకాల వర్షాల వలన ఈ తెగులు ఎక్కువగా సోకుతుందని, దీని నివారణకు ఎకరాకు హెక్సా కొనజోల్ 400 ఎమ్ఎల్ లేదా ప్రొఫికెనజోల్ 200 ఎమ్ఎల్ లేదా క్లోరోథలోనిల్ 400 గ్రాములు మరియు 5 కిలోల 13–0–45 చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. వేరు కుళ్ల తెగులు, మొదలు కుళ్ల తెగులు ఆశించిందని, దీని నివారణకు ఎకరాకు హెక్సా కొనజోల్ 400 ఎమ్ఎల్ లేదా కార్బెండిజమ్ మరియు మ్యాంకోజబ్ 400 గ్రాముల చొప్పున, 13–0–45 లేదా 19–19–19 అనే న్యూట్రియెంట్‌తో కలిపి పిచికారి చేయాలని సూచించారు. మినుము, నువ్వు పంటలను ఎక్కువ మంచుతో కూడిన వాతావరణ వుండడం వలన బూడిద తెగులు ఎక్కువగా ఆశిస్తోందని దాని నివారణకు లీటరు నీటికి కార్బెండిజమ్ 1 గ్రాము లేదా మైక్లో బుటానిల్ 1.5 గ్రాములు లేదా హెక్సా కొనజోల్ 2 ఎమ్ఎల్ కలిపి పిచికారి చేయాలన్నారు. ఆత్మా పీడీ విత్తన శుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. ట్రైకోడెర్మా విరిడి ఉపయోగాన్ని తెలిపారు. ఏవో సాయిజ్యోతి పంటల బీమా నియమ, నిబంధనలను గురించి వివరించారు. రబీలో సాగు చేసే వరి పంటకు ఈనెల 31వ తేదీ లోపు, మిగిలిన పంటలకు ఈనెల 15వ తేదీ లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాఠాలు బోధించకపోతే కఠిన చర్యలు తప్పవు



విద్యార్థినుల వినతిని పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

వేంపల్లె : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించకపోతే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి హెచ్చరించారు. పాఠాలు బోధించలేదని ఎంఈఓకు విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను తనిఖీ చేశారు. అలాగే విద్యార్థినులతో బోధనపై ఉపాధ్యాయుల తీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 5 మంది సైన్స్ ఉపాధ్యాయులు ఉన్నప్పటికి వారిలో సమన్వయంలేనట్లు గుర్తించినట్లు డీఈఓ తెలిపారు. ఉపాధ్యాయులు ఉండి కూడా పాఠాలు చెప్పకపోవడం మంచి పద్ధతి కాదన్నారు. విచారణలో తెలిసిన వివరాల మేరకు నివేదికను తయారు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో బోధించని ప్రతి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రధానోపాధ్యాయులు నారాయణమ్మ సైన్స్ ఉపాధ్యాయులను సమన్వయపరిచి విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు బోధన విషయంపైన మాట్లాడినా కసురుకుంటుందని విద్యార్థులు డీఈఓ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని డీఈఓకు ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు.

బీమా ప్రీమియం చెల్లించాలి

ముద్దనూరు : ప్రస్తుత రబీ సీజనులో పంట సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవడంతోపాటు బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని కొలవలి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 15వ తేదీనాటికి రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని, సకాలంలో పంటల తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు వహించాలని సూచించారు.

రాయలపంతులపల్లెలో రెవెన్యూ సదస్సు

చింతకొమ్మదిన్నె : మండలంలోని రాయలపంతుల పల్లెలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముగ్గురు రైతులు మాత్రమే భూసమస్యలపై అర్జీలు సమర్పించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. సదస్సులో తహసీల్దార్ నాగేశ్వరరావు, కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. గ్రామానికి సంబంధించిన ఎఫ్ఎల్ఆర్ రికార్డులు లేనందున రీసర్వే జరపాల్సి ఉందన్నారు.

అభినందనలు

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి కృషి ఫలితంగా ఇప్పుడు రైల్వేస్టేషన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం అనుమతులు వచ్చాయని వైఎస్సార్‌సీపీ మాడిశెట్టి శివకుమార్ వారికి అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వంలో వైఎస్ అవినాష్‌రెడ్డి, సుధీర్‌రెడ్డిలు దక్షిణ మధ్య రైల్వే అధికారులను కలిసి ఎర్రగుంట్లలోని ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులను మంజూరు చేయించడంతోపాటు టెండర్‌లను సైతం పూర్తి చేయించారు. అయితే టెక్నికల్ సమస్య ఉండటంతో వాటి పనులు ఇప్పుడు ప్రారంభమైనట్లు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పెండ్లిమర్రి : రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చనని వ్యవసాయశాఖ ఏడీఏ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నంరాజుపల్లె, పాతసంగటిపల్లె గ్రామ పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీడ పీడలపై రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. పంట సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు తప్పనిసరిగా చేయించాలన్నారు. పంట నమోదు చేయించిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల పంటల బీమా చేసుకోవచ్చన్నారు. పంట బీమాకు ఈనెల15వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

ఇ–పంట నమోదు తనిఖీ

వేముల : మండలంలోని గొందిపల్లె, గొల్లలగూడూరు గ్రామాల్లో మంగళవారం జరుగుతున్న ఇ–పంట నమోదును జిల్లా వనరుల కేంద్ర డీడీఏ వెంకటరమణారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రబీలో సాగు చేసిన ప్రతి పంటను ఇ–పంటలో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి వ్యవసాయ అసిస్టెంట్ రోజుకు 100 ఎకరాలు తగ్గకుండా పంట నమోదు చేయాలన్నారు. పంట ధృవీకరణ పత్రం తీసుకుని పంటల బీమా ప్రీమియం కట్టిన ప్రతి రైతును ఇ–పంటలో పంట నమోదు చేసుకునే విధంగా వ్యవసాయ అసిస్టెంట్లు రైతులను ప్రోత్సహించాలన్నారు. ఏఓ చెన్నారెడ్డి, డీఆర్పీ ఏఓ నాగభూషణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వల్లూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరమ్మ అధ్యక్షతన బుధవారం ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని కోరారు.

అధిక దిగుబడులు సాధించండి



శనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

కమలాపురం : వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు, ఇతర ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వారు చేసిన సూచనలను పాటించి అధిక దిగుబడులు సాధించాలని కేవీకే శాస్త్రవేత్త శిల్పకళ, ఆత్మ పీడీ విజయలక్ష్మీ తెలిపారు. మంగళవారం మండలంలోని కోగటం, ఎర్రగుడిపాడు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో భాగంగా సాగులో ఉన్న మినుము, శనగ, నువ్వు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనగ పంటకు ఆకు మాడు తెగులు ఆశించిందన్నారు. ఈ తెగులు విత్తనము, నేల నుంచి వ్యాప్తి చెందుతుందన్నారు. అకాల వర్షాలు కురిసినప్పుడు ఈ వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు 400 మి.లీ. హెక్సాకోనోజల్, లేదా క్లోరోథలోనిల్ 400 గ్రాముల చొప్పున ఎకరానికి 5 కిలోల 13.0.45 ను కలిపి పిచికారి చేయాలన్నారు. మినుము, నువ్వు పంటలకు బూడిద తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు 1గ్రాం. కార్బెండిజం, 1.5 గ్రాం. మైక్లో బూటానిల్ కలిపి పిచికారి చేయాలన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈనెల 15లోగా పంటల బీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వరి పంటలకు 31వరకు కాల పరిమితి ఉందన్నారు. డీఆర్‌సీ ఏఓ పద్మజ, మండల ఏఓ సరస్వతి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ ఉషారాణి

తొండూరు : స్థానిక గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉషారాణి విద్యార్థులకు పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడంవల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. విద్యార్థులతో కలిసి ఆమె మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, పంచాయతీ సెక్రటరీ సాయిప్రతాప్‌రెడ్డి, మహిళా పోలీసు గురుప్రవీణ, వెలుగు సిబ్బంది హరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన సదస్సు



లింగాల : మొక్కలు నాటుతున్న గురుకుల పాఠశాల విద్యార్థినులు

లింగాల : ఇప్పట్ల గ్రామ సమీపంలోని గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన సదస్సును ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రావణి మాట్లాడుతూ కిశోర బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యవతి, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

సింహాద్రిపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని అంకాలమ్మగూడూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల భూ సమస్యలు పరిష్కారానికి ఈ రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని, రైతు భూ సమస్యలు సభా దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ హరిబాబు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు (చెన్నూరు) : భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని దౌలతపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ వివాదాల పరిష్కారాల కోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. అనంతరం గ్రామంలోని రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు వాటిని 45 రోజుల్లోగా పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందులలో

పులివెందుల టౌన్/రూరల్ : రెవెన్యూ సదస్సులో సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ నజీర్‌అహ్మద్ తెలిపారు. మంగళవారం భాకరాపురం, రాగిమానుపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించే విధంగా చేసుకోవాలన్నారు. అనంతరం ప్రజలు ఇచ్చిన వినతులను స్వీకరించి వాటిని పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని వెలిదండ్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని పట్టాదారు పాసు పుస్తకాలలో సవరణలు, భూ సమస్యలు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించుకోవాలన్నారు. అదేవిధంగా రైతుల నుంచి అర్జీలను రెవెన్యూ అధికారులు స్వీకరించారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ పార్వతి, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.